
సాక్షి
వికారాబాద్
బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



నయా చోరులు!
టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్నా కొద్దీ కేటుగాళ్లు నేరాలు చేసేందుకు నూతన పద్ధతులు అన్వేషిస్తున్నారు. 8లో▸



వర్క్ షాప్‌లో ఉత్తమ ప్రతిభ
రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్ షాపులో రాష్ట్ర బృందం ప్రతిభ చాటింది. 8లో▸



తాగునీటి సమస్య తప్పింది
ఆలేడ్ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు కాంగ్రెస్ నేత అనంతయ్య పేర్కొన్నారు. 9లో▸

తెగుతున్న బంధాలు

ఆందోళన కలిగిస్తున్న కుటుంబ హత్యలు

రోజురోజుకూ నేర ప్రవృత్తి పెరిగిపోతోంది.. మానవ సంబంధాలు మంటగలిసి పోతున్నాయి.. అనుమానాలు.. అక్రమ సంబంధాలు.. ఆస్తి తగాదాలతో అయినవారని కూడా చూడకుండా అంతమొందించడం ఆందోళన కలిగిస్తోంది.

- ఒకరినొకరు కడతేర్చుకుంటున్న వైనం
- అక్రమ సంబంధాలు, ఆస్తి గొడవలే కారణం
- అనాథలవుతున్న పిల్లలు
- ఆందోళన కలిగిస్తున్న ఘటనలు

వికారాబాద్: అగ్ని సాక్షిగా ఏడడుగులు నడిచి మూడుముళ్ల బంధంతో ఒక్కటైన కొంతమంది ఒకరి పాలిట మరొకరు యమ పాశం విసురుకుంటున్నారు. ప్రియురాలి మోజులో భార్యను భర్త.. ప్రియుడి కోసం భర్తను భార్య.. ఆస్తిపై ఆశతో తండ్రిని కొడుకు కడతేర్చుతున్నారు. వావివరసలు మరచి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన కొడుకులు, మనుమలు పండుటాకుల ప్రాణం తీస్తున్నారు. ఇటీవల ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మోమిన్‌పేట, కోట్‌పల్లి, తాండూరు, వికారాబాద్, మొయినాబాద్ తదితర మండలాల్లో జరిగిన అమానవీయ ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పోలీసులు కేసులతో సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. నైతిక విలువలు పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో సామాజిక రుగ్మతలను రూపుమాపే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు సూచిస్తున్నారు.

మొదటి భర్తతో కలిసి..

బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ మహిళ మొదటి భర్తను వదిలేసి రెండో భర్తతో కలిసి తెలంగాణకు వచ్చింది. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ సమీపంలోని ఓ డెయిరీ ఫాంలో పనిచేసుకుంటున్నారు. ఇటీవల రెండో భర్తతో కూడా గొడవ పడింది. ఈ క్రమంలో మొదటి భర్తకు ఫోన్ చేసి ఇక్కడికి పిలిపించుకుంది. అతన్ని అంతమొందిస్తే మళ్లీ మనం కలిసి ఉండొచ్చని నమ్మబలికింది. ఇద్దరూ కలిసి హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యారు.



సీన్ రివర్స్

ఒకప్పుడు వరకట్నపు వేధింపులు, వివాహేతర సంబంధాల కారణంగా భార్యను భర్త, అత్తింటి వారు కడతేర్చిన ఘటనలు చూశాం. ఇటీవల కాలంలో సీన్ రివర్స్ అయ్యిందనిపిస్తోంది. భార్యలే భర్తలను అంతమొందిస్తున్న ఘటనలు వెలుగుచేస్తున్నాయి. రెండు నెలల వ్యవధిలోనే ఇలాంటి ఘటనలు జిల్లాలో మూడు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

- రెండు నెలల క్రితం తాండూరు మండలం మల్కాపూర్‌లో భార్య భర్తను హత్య చేసింది. కూతురికి తండ్రి కూడా సహకరించాడు. ఇద్దరూ కటకటాలపాలయ్యారు. వారి ఇద్దరు పిల్లలు అనాధలుగా మారారు.
- వారం రోజుల క్రితం ఇలాంటి ఘటనే మరొకటి చోటుచేసుకుంది. బంట్వారం మండలం కొంపల్లికి చెందిన దంపతులు మోమిన్‌పేట మండలం కేసారం గ్రామ శివారులోని ఓ ప్రైవేటు వెంచర్‌లో కూలి పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. గత ఆదివారం రాత్రి భర్తతో గొడవ పడి బండరాయితో తలపై మోది హతమార్చింది.
- తాజాగా రెండు రోజుల క్రితం ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. కోట్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన ఓ మహిళ భర్తతో తరచూ గొడవ పడేది. ఈ గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లిపోదామని పంచాయతీ పెట్టేది. భర్త ససేమిరా అనడంతో గత గురువారం రాత్రి పడుకున్న చోటే బండరాయితో తలపై మోది అంతమొందించింది. ఆమెకు ఎవరైనా సహకరించి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో వారి ఇద్దరు కూతుళ్లు అనాధలయ్యారు.

భార్యను కడతేర్చి ముక్కలుగా నరికి..

వికారాబాద్ మండలం కామారెడ్డిగూడకు చెందిన డ్రైవింగ్ వృత్తిలో ఉన్న యువకుడు ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఆరు నెలలు తిరగక ముందే వరకట్న వేధింపులకు పాల్పడుతూ వచ్చాడు. హైదరాబాద్ బోడుప్పల్‌లో నివాసముంటున్న అతను గర్భంతో ఉన్న భార్యను కనికరం లేకుండా అంతమొందించాడు. అంతటితో ఆగకుండా ముక్కలుగా నరికాడు. మొండెం నుంచి తల, శరీర భాగాలను వేరు చేసి మూసీలో పడేశాడు. 15 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన రాష్ట్రంలో సంచలనం రేపింది.

విలువలు అవసరం



ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. రోజురోజుకూ విలువలు తగ్గిపోతున్నాయి. ఇలాంటి ఘటనలను అరికట్టాలంటే విలువలతో కూడిన సమాజ నిర్మాణం అవసరం. పాఠశాల స్థాయి నుంచే మంచి సమాజం కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

– డాక్టర్ భాస్కరయోగి, రచయిత

11 గుంటల భూమి కోసం అన్నదమ్ముల కొట్లాట

ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని దండుమైలారంలో 11 గుంటల భూమి కోసం అన్నదమ్ముల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆగస్టు 31న చోటు చేసుకుంది.

న్యూస్‌రీల్

కాళోజీ జీవితం ఆదర్శం

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు

అనంతగిరి: ప్రజాకవి స్వర్గీయ కాళోజీ నారాయణరావు జీవితం అందరికీ ఆదర్శమని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీ సేవలను కొనియాడారు. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డీఓ వాసుచంద్ర, బీసీ సంక్షేమ శాఖ అధికారి మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్
- టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ



న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

తాండూరు టౌన్: టీబీ వ్యాధి గ్రస్తులు మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌ఎంపీ సంఘం సౌజన్యంతో పలువురు వ్యాధి గ్రస్తులకు న్యూట్రిషన్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ బారిన పడ్డ రోగులు పౌష్టికాహారం తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల పౌష్టికాహారం తీసుకోలేవని వారికి ఆర్‌ఎంపీ సంఘం ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్స్ అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ తాండూరు అధ్యక్షులు, సభ్యులు పవన్, పాషా, జయరామాచారి, నర్సింలు, శ్యాంకుమార్ సింధే, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీగా రాములునాయక్



ఎస్పీ నారాయణరెడ్డికి బొకే అందజేస్తున్న రాములునాయక్

అనంతగిరి: వికారాబాద్ జిల్లా ఏఎస్పీగా బి.రాములునాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారు. విధుల్లో చేరిన అనంతరం ఎస్పీ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

యాలాల ఎస్‌ఐగా విఠల్‌రెడ్డి



యాలాల: మండల నూతన ఎస్‌ఐగా విఠల్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన విఠల్‌ను ఎస్‌ఐ – 2గా ఇదే పీఎస్‌కి కేటాయించగా, ఎస్‌హెచ్‌ఓగా విఠల్‌రెడ్డికి బాధ్యతలు ఇచ్చారు. గతంలో యాలాల ఎస్‌ఐగా విధులు నిర్వహించిన విఠల్‌రెడ్డికి మండలంపై మంచి పట్టు ఉంది. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడతానని ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి పేర్కొన్నారు.

12న ఉద్యోగాల నియామకాలకు ఎంపిక

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగాల నియామకాల కోసం ఎంపిక చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కమల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్ఎస్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఈనెల 12న ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన విద్యార్థులు లేదా మధ్యలో ఆపేసిన అభ్యర్థులు, డిప్లమా, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. 2021 నుంచి 2025 వరకు ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఎంపికైనవారు జడ్చర్ల, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఫార్మా పరిశ్రమల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో నెలకు రూ.13వేల నుంచి రూ.16వేల వరకు స్టైఫండ్ చెల్లిస్తారని తెలిపారు.

ప్రజలతో మమేకమవ్వండి

శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వద్దు

- ఎస్పీ నారాయణరెడ్డి

దోమ: శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించరాదని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం దోమ పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం కేసుల వివరాలను ఎస్‌ఐ వసంత్ జాదవ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ వాహనాల తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

న్యాయం చేయండి

మా స్థలంలో ఓ వ్యక్తి దౌర్జన్యంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని.. న్యాయం చేయాలని దిర్సంపల్లికి చెందిన కూర శ్రీశైలం ప్రజాసంఘాల నాయకులు వెంకటయ్య, గోవింద్ నాయక్‌తో కలిసి ఎస్పీ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామ సర్వే నంబర్ 16/1(ప్లాట్ నంబర్ 77)లో 135 గజాల స్థలం ఉందని.. దాన్ని గ్రామానికి చెందిన కొత్తకాపు నర్సింహారెడ్డి ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే దాడి చేశారని తెలిపారు. స్పందించిన ఎస్పీ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాస్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వసంత్ జాదవ్, రైటర్లు వెంకట్‌రెడ్డి, వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ ఫోరం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాధవరెడ్డి

- అభినందించిన మంత్రి తుమ్మల

బషీరాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం ప్రధాన కార్యదర్శిగా బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమైన చైర్మన్లు ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా మల్లేశం ముదిరాజ్‌ను, ప్రధాన కార్యదర్శిగా మాధవరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అనంతరం సచివాలయంలో వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శాలువతో మాధవరెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫోరం గౌర అధ్యక్షుడు చిలక మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలతో మాధవరెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జనార్దన్, ఎస్‌ఐ సత్యనారాయణ

ఖోఖోలో సత్తాచాటిన విద్యార్థులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం 69వ ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల్ మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ –17 బాలుర విభాగం ఖోఖో పోటీల్లో ఎంజేపీ(మహాత్మా జ్యోతి బాపులే) గురుకుల పాఠశాల కొడంగల్ జట్టు విజేతగా నిలిచింది. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలు జట్టు కొడంగల్ రన్నర్‌గా నిలిచింది. అండర్ – 17 బాలికల విభాగంలో ఎంజేపీ గురుకు పాఠశాల బూరాన్‌పూర్ జట్టు విజేతగా, జెడ్పీహెచ్‌ఎస్ బాలంపేట జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్ – 14 బాలికల విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ గోకఫస్లాబాద్ జట్టు విజేతగా..జెడ్పీహెచ్‌ఎస్ దుద్యాల్ జట్టు రన్నర్‌గా నిలిచింది. అండర్–14 బాలుర విభాగంలో ఎంజేపీ గురుకుల పాఠశాల కొడంగల్ జట్టు విన్నర్‌గా, ఎంజేపీ దౌల్తాబాద్ జట్టు రన్నర్‌గా నిలిచినట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజర్ అజీజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ రాంరెడ్డి,ఎస్‌ఐ జీవీ సత్యనారాయణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పట్వారి జనార్దన్, ఆయా పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

- రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రెడ్డి

పూడూరు: వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి పంటలను కాపాడుకోవాలని రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని మేడికొండ గ్రామంలో పత్తి, బంతి, చేమంతి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరువాక శాస్త్రవేత్తలు మధుకర్, జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం, ఏడీఏ లక్ష్మీకుమారి పంటల సాగుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తులసీరాం, ఉద్యాన వన అధికారి సురేంద్రనాథ్, ఏఈఓ ఇలియాస్, రైతులు అనంత్‌రెడ్డి, యాదయ్య, రాంరెడ్డి, నర్సింలు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



పూల తోటను పరిశీలిస్తున్న అధికారులు

ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలి

చేవెళ్ల: మద్యం తాగి వాహనాలు నడపకూడదని, దీంతో వారి ప్రాణాలతోపాటు ఎదుటి వారి ప్రాణాలకు ప్రమాదమని రిటైర్డు జడ్జి సాంబశివరావు అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో మంగళవారం రెండో రోజు ట్రాఫిక్ పోలీస్ కేసుల లోక్ అదాలత్ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకు ఏర్పాటు చేసిన లోక అదాలత్ ఈనెల 13వ తేదీ వరకు కొనసాగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం, ఏఎస్‌ఐ చందర్‌నాయక్, కానిస్టేబుళ్లు జంగయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతన్న

- వ్యవసాయానికి అర్ధరాత్రి విద్యుత్ సరఫరాపై ఆందోళన
- సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు
- జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు



రైతులను సముదాయిస్తున్న ఎస్‌ఐ మోహనకృష్ణ

పరిగి: వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా కాకపోవడంతో రైతులు ఆగ్రహించారు. మంగళవారం మండలంలోని రంగాపూర్ గేట్ వద్ద, సబ్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. గంటపాటు జాతీయ రహదారిపై బైఠాయించడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువురు అన్నదాతలు మాట్లాడుతూ.. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సాగుకు అర్ధరాత్రి కరెంటు సరఫరా చేస్తుండలంతో పంటలకు నీరు ఎలా పెట్టాలని ప్రశ్నించారు. వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు విడతల వారీగా సరఫరా చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంటును నమ్ముకొనే ఎక్కువ పంటలు వేశామని కోతలు విధిస్తుండటంతో నష్టపోతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేదని.. కాంగ్రెస్ వచ్చాక సక్రమంగా రావడం లేదని పలువురు ఆరోపించారు. సీఎం జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇతర ప్రాంతాల్లో ఎంత ఘోరంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అధికారులు వచ్చి మా సమస్య పరిష్కరించేంత వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న పరిగి ఎస్‌ఐ మోహనకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. విద్యుత్ సమస్యను అధికారుల దృష్టి కి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు.

అన్నదాత పోరు బాట!

- యూరియా, వ్యవసాయ విద్యుత్, ట్రిపుల్ ఆర్‌పై ఆందోళనలు
- ధర్నాలు.. రాస్తారోకోతో దద్దరిల్లుతున్న సీఎం జిల్లా..



ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలంటూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

వికారాబాద్: జిల్లాలో ఎటు చూసినా అన్నదాతల ఆందోళనలే కనిపిస్తున్నాయి. యూరియా కోసం.. వ్యవసాయానికి 24గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని.. అభివృద్ధి పేరిట తమ భూములు లాక్కోవద్దంటూ రోడ్డెక్కుతున్నారు. యూరియా కోసం పది రోజులుగా పడరాని పాట్లు పడుతున్నారు. తెల్లారింది మొదలు ఫెర్టిలైజర్ దుకాణాలకు, పీఏసీఎస్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఒక్కొక్కరికి ఒక్కో బస్తా కూడా దొరక్కపోవడంతో కార్యాలయాలను ముట్టడిస్తున్నారు. ఈ సెగ కలెక్టరేట్‌కు కూడా తాకింది. రెండు రోజులుగా వికారాబాద్‌లో నిరసనలు మింటన్నుతున్నాయి. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో అన్నదాతలు రోడ్డెక్కడం ప్రభుత్వానికి మచ్చ తెచ్చేలా మారింది.

వెంటాతున్న యూరియా కొరత

తాండూరు, పెద్దేముల్, పరిగి, వికారాబాద్ వ్యవసాయ డివిజన్లలో యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఎరువుల కొనుగోలుకు ఎగబడుతున్నారు. అవసరం మేర సరఫరా చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నాలుగు ఎకరాలకు ఒకే బస్తా ఇస్తున్నారని మండిపడుతున్నారు. ఎక్కడ చూసినా యూరియా క్యూలే దర్శనమిస్తున్నాయి. సోమవారం పరిగి, తాండూరు ప్రాంతాల్లో ఎరువులు దొరక్క రైతులు వెనుదిరగడం కనిపించింది. పెద్దేముల్, యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పరిగి మండలం రంగంపల్లి గేట్ వద్ద కూడా ఆందోళన చేపట్టారు. అయితే అధికారులు చెబుతున్న మాటలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. యూరియా కొరత లేదని, అందరికీ పంపిణీ చేస్తామని చెప్పడం అనుమానం కలిగిస్తోంది. నానో యూరియా వాడాలని సూచిస్తున్నారు. ఐదువేల లీటర్లు అందుబాటులో ఉందని పేర్కొన్నారు. లీటరు రెండెకరాలకు సరిపోతుందని చెబుతున్నారు. ప్రస్తుత సీజన్‌కు 39,898 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 23వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. మరో వెయ్యి మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది.

ట్రిపుల్ ఆర్ గుబులు

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడంపై జిల్లాలోని రైతుల్లో ఆందోళన మొదలైంది. మా పొలాల మీదుగా రీజినల్ రింగ్‌రోడ్డు వద్దంటూ ఆందోళనలు మొదలయ్యాయి. వికారాబాద్ కలెక్టరేట్‌తో పాటు హెచ్‌ఎండీఏ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేస్తున్నారు. తాజా ప్రతిపాదనలతో జిల్లాలోని నాలుగు మండలాల మీదుగా ట్రిపుల్ ఆర్ వెళ్లనుంది. పూడూరు, నవాబుపేట మండలాల పరిధిలోని 20కి పైగా గ్రామాలు రీజనల్ రింగ్‌రోడ్డు పరిధిలోకి వస్తుండగా.. వికారాబాద్, మోమిన్‌పేట మండలాల పరిధిలోని ఐదారు గ్రామాలను కలుపుతూ కొత్త ప్రతిపాదనలు చేశారు. దీంతో ఆయా గ్రామాల రైతుల్లో ఆందోళన మొదలైంది. పచ్చటి పొలాల్లో కాకుండా సాగుకు ఉపయోగపడని భూముల మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు వేయాలని అన్నదాతలు కోరుతున్నారు. మంగళవారం ఇదే అంశంపై కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. కొత్త అలైన్‌మెంట్ మార్చి మా భూములు పోకుండా చూడాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పోలీస్ ఉద్యోగం కత్తిమీద సాము



బదిలీపై వెళ్లిన కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్‌ఐ వేణుకుమార్

తాండూరు రూరల్: పోలీస్ ఉద్యోగం కత్తిమీద సాము లాంటిదని పెద్దేముల్ ఎస్‌ఐ వేణుకుమార్ అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో పని చేసి బదిలీపై వెళ్లిన కానిస్టేబుళ్లను ఆయన శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. అన్ని ఉద్యోగాల కంటే పోలీస్ ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నాదన్నారు. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి వారికి రక్షణ కల్పించాలన్నారు. బదిలీపై వెళ్లిన కానిస్టేబుల్ మాసయ్య, రవి, సంతోష్, ధనరాజ్‌ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేశ్, రఫీక్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా కొప్పు బాషా



యాచారం: గ్రామానికి చెందిన కొప్పు బాషా బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన ఆయన 2000 సంవత్సరం నుంచి ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ, బీజేవైఎంలలో కీలక పదవులు నిర్వర్తించారు. ఈ క్రమంలో తన సతీమణి సుకన్యను యాచారం ఎంపీపీగా పదవీలో కూర్చోబెట్టారు. అనంతరం బండి సంజయ్ రాష్ట్రాధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ కులాల్లోని ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగిన రాజీలేని పోరాటం చేశారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం తాజాగా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు మంగళవారం తన నివాసంలో పార్టీకి చెందిన పలువురు నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొప్పు బాషా మాట్లాడుతూ... పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

వ్యక్తి బలవన్మరణం

షాద్‌నగర్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఓ వ్యక్తి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం పట్టణ శివారులోని కీర్తి వెంచర్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్‌లోని వివేకానంద కాలనీకి చెందిన చాపల గోపాల్(39) ఓ పెట్రోల్ పంపులో పని చేస్తున్నాడు. తల్లిదండ్రులు లేక పోవవడం, అవివాహితుడు కావడంతో తన అన్న శేఖర్‌వద్దే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, పెళ్లి కాకపోవడంతో మనస్థాపంతో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మంగళవారం కీర్తి వెంచర్ సమీపంలో రైలు కిందపడి ఆతహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధార్‌కార్డు, ఏటీఎం కార్డుల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



గోపాల్ (ఫైల్)

రైతు ఆత్మహత్య

బషీరాబాద్: మతిస్థిమితం లేని ఓ రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బషీరాబాద్ మండలం మంతట్టిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నుమాన్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన తలారి హన్మప్ప(63) వ్యవసాయం చేసేవాడు. కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయినట్లు వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కొడుకు నర్సింలుతో కలిసి పత్తి చేనులో పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. నర్సింలు పంపులో నీళ్లు నింపేందుకు బోరుమోటారు వద్దకు వెళ్లగా.. హన్మప్ప పురుగుల మందు తాగాడు. కొడుకు వచ్చేసరికి నురగలు కక్కుతుండటంతో 108లో తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య తుల్జమ్మ, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏఎంసీ చైర్మన్ల ఫోరం అధ్యక్షుడిగా పెంటయ్యగౌడ్

చేవెళ్ల: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడిగా చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ జి.పెంటయ్యగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నగరంలో నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించారని చెప్పారు. చైర్మన్‌గా టి.మల్లేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా కె.వేణుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జి.మాధవరెడ్డి, జాయింట్ సెక్రటరీగా బి.ఆంజనేయులు ఎన్నికయ్యారని చెప్పారు. నూతన కమిటీ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిశామన్నారు.

నయా చోరులు!



ఫోన్ పే, గూగుల్ పే స్కాన్ చేసి సరుకుల కొనుగోలు

- నగదు ఖాతాలో జమ కావడం లేదని వ్యాపారుల గగ్గోలు
- దుద్యాల్‌లో వెలుగు చూసిన కొత్తరకం సైబర్ మోసం
- డిజిటల్ పేమెంట్స్‌పై జాగ్రత్తగా ఉండాలని పోలీసుల సూచన

దుద్యాల్: శాస్త్ర సాంకేతిక రంగం కొత్త పుంతలు తొక్కుతున్నా కొద్దీ కేటుగాళ్లు నేరాలు చేయడానికి నూతన సాధనాలను అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం డిజిటల్ పేమెంట్స్ యుగం నడుస్తున్న తరుణంలో సైబర్ నేరస్తులు వినూత్న రీతిలో మోసాలకు తెగబడుతున్నారు. తెలియని ఫోన్ నంబర్ల నుంచి కాల్ చేసి మృదువుగా మాట్లాడి బ్యాంక్ ఖాతా వివరాలు తెలుసుకొని అందిన కాడికి లూటీ చేస్తున్న ఘటనలున్నాయి. లేదంటే మీకు లాటరీ వచ్చిందని చెప్పి వివరాలు ఆరా తీసి బెదిరింపులకు పాల్పడుతున్న పోకడలు చూస్తున్నాం. ఇవే కాకుండా సైబర్ నేరస్తులు డిజిటల్ అరెస్టు, హనీ ట్రాప్, మొబైల్ హ్యాక్, వివిధ రూపాల్లో జనాలను బురిడీ కొట్టిస్తున్నారు. తాజాగా దుద్యాల్ మండలంలో కొత్తరకం సైబర్ మోసం చోటు చేసుకుంది. కిరాణ దుకాణాలను లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు మధ్యాహ్నం వేళలో కిరాణం, ఇతర వ్యాపారం చేసుకునే వారి దగ్గరకు వచ్చి కావాల్సిన సరుకులు కొనుగోలు చేశారు. వాటికి సంబంధించిన మొత్తం బిల్లును ఆన్‌లైన్ రూపంలో చెల్లించారు. అప్పటికప్పుడు నగదు ఖాతాలో జమ అయినట్లు చూపగా.. అనంతరం ఎక్స్‌ప్రైడ్, డిక్లైన్ అని వచ్చి అమౌంట్ మాయమవుతున్న ఉదంతం చోటు చేసుకుంది. హస్నాబాద్ గ్రామానికి చెందిన కిరాణ దుకాణం నిర్వాహకుడు కొడంగంటి వెంకటేశ్, కొడంగల్ మండల పరిధిలోని పెద్దనందిగామ గ్రామానికి చెందిన కిరాణ వ్యాపారి శివకుమార్‌లకు ఇలాంటి ఘటనలు ఎదురయ్యాయి.

రెండు ఘటనలు

ఒకరోజు గడిచాక ఖాతాలో నగదు చెక్ చేయగా బాధితులు కంగుతిన్నారు. కేవలం మెసేజ్ రూపంలో డబ్బులు జమ అయినట్లు చూపించి, అనంతరం దుండగులు మోసానికి పాల్పడ్డారు. దీంతో వ్యాపారులు బ్యాంకుల చుట్టూ తిరిగి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. వ్యాపారి వెంకటేశ్ వద్ద రూ.1,200ల సరుకులు గత నెల 30న, శివకుమార్ వద్ద 15 రోజుల క్రితం రూ.1,680ల సరుకులు కొనుగోలు చేసి నగదు ఆన్‌లైన్ చేసినట్లు చూయించారు. అనంతరం ఖాతాలో నగదు జమకాకుండా మాయం చేశారని బాధితులు వాపోతున్నారు.



హస్నాబాద్‌లో వ్యాపారికి వచ్చిన మెసేజ్

అప్రమత్తంగా ఉండాలి



ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని వ్యక్తుల నుంచి ఫోన్, వీడియో కాల్స్ వస్తే స్పందించొద్దు. వ్యాపారస్తులు కూడా ఆన్‌లైన్ పేమెంట్ చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కొంత మంది న్యూడ్ వీడియోకాల్స్ చేసి వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తుంటారు. అలాంటి వాటిని వెంటనే తిరస్కరించాలి.

– శ్రీనివాస్, డీఎస్పీ, పరిగి

కళ్లకు గంతలతో గణిత అవధానం

ధారూరు: మండలంలోని నాగసమందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్రపతి అవార్డు గ్రహీత విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అనంతప్పయాదవ్ కళ్లకు గంతలు కట్టుకొని గణిత అవధానం నిర్వహించారు. శతావధానంలో భాగంగా ఒకటి నుంచి 100 వరకు నంబర్లను విద్యార్థులు బోర్డుపై రాసిన వాటిని ఆయన కళ్లకు గంతలు కట్టుకుని వరుసగా ఆరోహణ, అవరోహన క్రమంలో వివరించారు. మాయ కూడిక, మాయ చదరం, తేదీ చెబితే వారం చెప్పడం తదితర అంశాలను ఆయన విద్యార్థులకు నేర్పించారు. విద్యార్థులు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంచుకోవడానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేశ్, జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రదర్శన చేస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అనంతప్పయాదవ్



కొడంగల్ రూరల్: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కాళోజీ జయంతి వేడుక

కాళోజీ రచనలు స్ఫూర్తిదాయకం

'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి.. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి.. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని ధిక్కార స్వరాన్ని వినిపించిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో మంగళవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాళోజీ చిత్రపటాలకు నాయకులు, అధికారులు, మేధావులు, సంఘ సంస్కర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. తెలంగాణ పోరాటంలో కాళోజీ రచనలు స్ఫూర్తి నింపాయని వక్తలు పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు అవిరల కృషి చేశారన్నారు.



పరిగి: కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది



అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కమిషనర్



అనంతగిరి: సిద్దులూర్ స్కూల్‌లో మాట్లాడుతున్న రిటైర్డ్ జనరల్ మేనేజర్



తాండూరు టౌన్: మున్సిపల్ కార్యాలయంలో..



మొమిన్‌పేట: ఏన్కతల పాఠశాలలో ఉపాధ్యాయుడికి సన్మానం



దుద్యాల్: ఎంజేపీ గురుకుల కళాశాలలో..



తాండూరు రూరల్: పెద్దేముల్‌లో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

గుప్తనిధుల కేసుపై ఎస్పీ ఆరా

బషీరాబాద్: గుప్తనిధుల్లో రాయ్జబేరాలు₹ శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనం పోలీసువర్గాల్లో కలకలం రేపింది. దీనిపై ఎస్పీ నారాయణరెడ్డి ఆరా తీసినట్లు సమాచారం. బషీరాబాద్‌లో గత ఆదివారం జరిగిన నిధుల తవ్వకాల కేసులో పోలీసుల విచారణలో ఏం జరిగిందనే విషయమై తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మంగళవారం అంతర్గత విచారణ జరిపినట్లు తెలిసింది. ఆ రోజు పోలీస్ స్టేషన్‌లో ఎలా విచారణ జరిపారు..? కేసులో ఉన్న వారినుంచి పోలీసులు డబ్బులు డిమాండ్ చేశారా..? అనే కోణంలో పలువురిని ప్రశ్నించినట్లు పోలీసువర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా ఈ కేసులో ఆరుగురిపై నేరానికి సంబంధించిన అప్లికెబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. ఎవరు తప్పు చేసిన చర్యలు తప్పవని అన్నారు.

కిడ్నాపర్‌గా భావించి.. చితకబాదారు

గచ్చిబౌలి: చిన్న పిల్లల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను చితకబాది పోలీసులకు అప్పగించిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం ఉదయం మసీద్‌బండలోని అనసూయహిల్స్ వద్ద గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదంగా తిరుగుతోంది. అక్కడే ఆడుకుంటున్న చిన్నపిల్లల వద్దకు రాగా తల్లిదండ్రులు ఆమె వివరాలు ఆరా తీశారు. ఆమె సమాధానం చెప్పకపోవడంతో కిడ్నాపర్‌గా భావించి చితకబాదారు. డయల్ 100 ఫోన్ చేసి గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఇటీవల కూలీల పిల్లలను టార్గెట్ చేసుకుని చిన్నారులను కిడ్నాప్‌చేసి విక్రయించిన ముఠాను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తమ పిల్లలకు వద్దకు వచ్చిన మహిళను ఎక్కడ ఉంటావు, నీ పేరేమిటి అని అడిగిన సరైన సమాధానం ఇవ్వకపోవడంతో స్థానికులు కిడ్నాపర్‌గా భావించి చితక బాది పోలీసులు అప్పగించారు. ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా తన పేరు పూనమ్ (35) అని, మధ్యప్రదేశ్ అని చెబుతున్నట్లు తెలిపారు. మహిళ పోలీసులు ఆమెను తీసుకెళ్లి సమీప ప్రాంతాల్లో వాకాబు చేసినా ఎక్కడ ఉండేది చూపించ లేదని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆమెను మతిస్థిమితం లేనట్లు భావించి హోంకు తరలించామన్నారు. సదరు మహిళ వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు లేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ఎంఈఓ ఆఫీసులో ల్యాప్‌టాప్ చోరీ

తాండూరు రూరల్: పెద్దేముల్ మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. ఈ సంఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ వేణుకుమార్ కథనం ప్రకారం.. జనగాం గ్రామానికి చెందిన శ్రీశైలం ఎంఈఓ ఆఫీసులో ఆధార్ నమోదు సెంటర్ నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగా సోమవారం పని ముగించుకుని ల్యాప్‌టాప్‌ను అక్కడే పెట్టి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా కార్యాలయంలో ల్యాప్‌టాప్ కనిపించలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో పెద్దేముల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్‌ఐ తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. కిటికీ సమీపంలో పెట్టడంతోనే ల్యాప్‌టాప్ చోరీకి గురైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎంఈఓ కార్యాలయంతో పాటు పక్కనే ఉన్న తహసీల్దార్ ఆఫీసులో కూడా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై ఎస్‌ఐ అసహనం వ్యక్తంచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



ఎంఈఓ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వేణుకుమార్

వర్క్ షాప్‌లో ఉత్తమ ప్రతిభ

మొమిన్‌పేట: రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్ షాపులో తెలంగాణ బృందం ఉత్తమ ప్రతిభ చాటిందని ఇందులో పాల్గొన్న ఉపాధ్యాయుడు దండు రమేశ్ అన్నారు. విద్యలో తోలుబొమ్మలాట పాత్ర అనే అంశంపై పదిహేను రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారన్నారు. 13రాష్ట్రాలకు చెందిన 90మంది ఉపాధ్యాయులు ఇందులో భాగస్వాములయ్యారని వివరించారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, ఖనిజ సంపద, సహజ సౌందర్యం తదితర అంశాలను నృత్య సంగీతం ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చామని తెలిపారు. ప్రాథమిక తరగతి బోధనలో పప్పెట్రీ ద్వారా జాయ్‌ఫుల్ లెర్నింగ్ జరిగేలా ఉపాధ్యాయులను సంసిద్ధం చేయడం, జాతీయ ఐక్యత భావాన్ని పెంపొందించామని వివరించారు. మంగళవారం నిర్వహించిన కథ, కళలు, బుర్రకథ, హరికథలు, లంబాడీ నృత్యాలకు అందరి నుంచి ప్రశంసలు వచ్చాయన్నారు. తెలంగాణలోని పది జిల్లాల నుంచి ఉపాధ్యాయులు ఇందులో పాల్గొన్నారని తెలిపారు.



ఉదయ్‌పూర్‌లో నృత్య ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయులు



గొడుగు పట్టి.. సేద తీర్చి

కొడంగల్ రూరల్: పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న కంప చెట్టు ప్రయాణికులకు ఆశ్రయం కల్పిస్తోంది. బస్టాండ్ ప్రాంగణం ఉన్నా కిక్కిరిసి జనాలు ఉండడంతో చెట్టు నీడనే చాలా మంది ఆశ్రయిస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువయిందని ప్రయాణికులు వాపోయారు. దీంతో ఉపశమనం కోసమని గొడుగు మాదిరిగా ఉన్న చెట్టు కిందకు చేరుతున్నారు.

పీజీ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల సత్తా

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పీజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటడం గర్వకారణంగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విద్యార్థుల కృషి, పట్టుదలతో ఉన్నత విద్యలో ముందుకు సాగడం విశేషమన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. యూనివర్సిటీ స్థాయిలో కె.అనిల్ ఫిజిక్స్‌లో 69వ ర్యాంకు, కె.జగదీష్ ఎంఏ తెలుగు 14వ ర్యాంకు, కె.రమేష్ సెంట్రల్ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో సీటు సాధించారన్నారు. అనిల్ మ్యాథమెటిక్స్‌లో, స్వాతి, అశ్విని, కుమారి, ప్రమీళ కెమిస్ట్రీలో మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు.



జగదీష్ (ఎంఏ తెలుగు) ర్యాంకు 14



అనిల్‌కుమార్(ఎంఎస్సీ ఫిజిక్స్) ర్యాంకు 69



అశ్విని (ఎంఎస్సీ కెమిస్ట్రీ) ర్యాంకు 263

కోడి పందేల స్థావరంపై దాడి

- ఇద్దరు పందెంరాయుళ్లు అరెస్ట్
- మూడు పందెం కోళ్లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరు పందెం రాయుళ్లను రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ నోయల్‌రాజ్ తెలిపిన ప్రకారం.. మన్నెగూడ అటవీ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు తమ సిబ్బంది దాడి చేయగా తుర్కయంజాల్‌కు చెందిన తన్నీరు వేణుగోపాల్(32), కట్టంగూర్‌కు చెందిన దాచేపల్లి శేషగిరిరావు(40)ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల రాకను గుర్తించిన పులువురు అక్కడ నుంచి పరారయ్యారు. వారి వద్ద మూడు పందెం కోళ్లను, రెండు సెల్‌పోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.



పోలీసుల అరెస్ట్ చేసిన పందెంరాయుళ్లు

చంద్రవంచలో ఉద్రిక్తత!

- వినాయక నిమజ్జన వేడుకలో మొదలైన గొడవ
- అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి ఇరువర్గాల దాడులు
- ఆపేందుకు వెళ్లిన కానిస్టేబుల్ తలకు గాయం

తాండూరు రూరల్: వినాయక నిమజ్జన వేడుకలో మొదలైన చిన్న గొడవ చినికిచినికి గాలి వానలా మారింది. ఈ సంఘటన మండలంలోని చంద్రవంచలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలో ఈ నెల 6వ తేదీన వినాయక నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. ఈశ్వరుడి దేవాలయం వద్ద ఇరువర్గాలకు చెందిన విగ్రహాలు ఎదురుపడ్డాయి. ట్రాక్టర్‌ను పక్కకు తీస్తే ముందుకు వెళ్తామని ఓ వర్గం యువకులు కోరారు. ఈ విషయమై ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. మరుసటిరోజు ఆదివారం పెద్ద మనుషులు సమక్షంలో పంచాయితీ పెట్టి సముదాయించారు. అంత సద్దుమణిగిందనుకున్న క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాలకు చెందిన యువకులు ఇళ్లల్లోకి వెళ్లి మరీ దాడులు చేసుకున్నారు. దీంతో రెండు వర్గాలకు చెందిన కొందరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 100కు కాల్ చేయడంతో గ్రామానికి కానిస్టేబుల్ బస్వరాజ్, శేఖర్‌లు వెళ్లారు. గొడవ ఆపేందుకు వెళ్లిన కానిస్టేబుల్ బస్వరాజ్ తలకు బలమైన గాయమైంది. దీంతో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడిలో గాయపడిన వారికి సైతం వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ నగేశ్, ఎస్‌ఐ రాథోడ్ వినోద్ మంగళవారం చంద్రవంచ గ్రామానికి వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం సాయంత్రం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సైతం గ్రామంలో పర్యటించి దాడి గల కారణాలను తెలుసుకున్నారు. కానిస్టేబుల్ గాయపడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



తలకు గాయంతో కానిస్టేబుల్ బస్వరాజ్



తలకు గాయమైన ఓ యువకుడు



నెత్తుటి మరకలతో ఓ వ్యక్తి

కేసులు నమోదు చేశాం

గ్రామంలో అర్ధరాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణపై 15 నుంచి 20 మందిపై కేసులు నమోదు చేశాం. గొడవ జరిగిన సందర్భంలో కానిస్టేబుల్ తీసిన వీడియో ఆధారంగా మరికొంత మందిని గుర్తిస్తున్నాం. కొందరు గ్రామం వదిలి పారిపోయారు. వారిని కూడా గుర్తించి కేసులు నమోదు చేస్తాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన ఎంతటి వారైనా శిక్షార్హులు.

– నగేశ్, తాండూరు రూరల్ సీఐ